క్లుప్తంగా

రామావతారంలో జగన్నాథుడు



భీమునిపట్నం: భీమిలిలో జరుగుతున్న జగన్నాథ స్వామి రథోత్సవ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆర్.సింగరాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. రామావతారం గురించి భక్తులకు వివరించారు.

రేపటి నుంచి ఎన్‌ఎంఎంఎస్ ఉచిత శిక్షణ తరగతులు

తగరపువలస: 2025–26 విద్యా సంవత్సరానికి గాను నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) ఉచిత శిక్షణ తరగతులు ఆదివారం నుంచి చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్టు ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుడు గంటాన మోహనరావు తెలిపారు. భీమిలి నియోజకవర్గంలోని వివిధ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులను ఎంపిక చేసి పంపించాలని ఉపాధ్యాయులను కోరారు. తల్లిదండ్రుల సాయంతో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వివరాలకు 94932 01857, 93819 87074 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చిన్నబజారు వద్దకు పోస్టాఫీస్ మార్పు

భీమునిపట్నం: భీమిలిలోని తపాలా కార్యాలయం (పోస్టాఫీసు)ను వేరే ప్రాంతానికి మార్చామని సబ్ పోస్ట్ మాస్టర్ బోని చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. ఇప్పటివరకు పెద్దబజారు శివాలయం ఎదురుగా ఉన్న రోడ్డులో ఈ కార్యాలయం ఉండేదని, ఇప్పుడు దాన్ని చిన్నబజారు వద్ద ఎస్‌బీఐ ఏటీఎం ఉన్న భవనంపై అంతస్తులోకి మార్చామన్నారు.

బాలికల హాస్టల్ అదనపు భవనం ప్రారంభం



హాస్టల్ విద్యార్థినులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే గంటా

మధురవాడ: విద్యార్థులు ఇష్టమైన రంగంలో రాణించాలంటే ఉన్నతమైన గోల్ ఏర్పాటు చేసుకుని, అది సాధించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. జీవీఎంసీ 5వ వార్డు బోరవానిపాలెం సమీపంలోని డ్రైవర్స్ కాలనీలో దివీస్ ల్యాబొరేటరీ సీఎస్ఆర్ నిధులు రూ.71.8లక్షలతో ఎస్సీ కళాశాల బాలికల హాస్టల్ భవనానికి మరమ్మత్తులు చేసి, అదనంగా నిర్మించిన భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. దివీస్ యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం విద్యార్థినులకు స్పోర్ట్స్ సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో దివీస్ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు, సీఎస్ఆర్ మేనేజర్ సురేష్, కొండయ్య, సోషల్ వెల్ఫేర్ డీడీ రామారావు, తహసీల్దార్ పాల్‌కిరణ్, జోన్–2 జోనల్ కమిషనర్ కొట్యాడ కనకమహాలక్ష్మి, నాయకుడు స్వామి, భీమిలి జనసేన ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, కార్పొరేటర్‌లు మొల్లి హేమలత, గాడు చిన్నికుమారి పాల్గొన్నారు.

సమస్యలతో సహవాసం

- దెబ్బతిన్న రోడ్లు
- వెలగని వీధి లైట్లు
- తాగునీటికి ఇక్కట్లు
- అధ్వానంగా పారిశుధ్యం
- 8వ వార్డులో అడుగడుగునా కష్టాలే



శిథిలావస్థకు చేరుకున్న పార్కు



దయనీయ స్థితిలో రోడ్లు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ప్రజలు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం పుణ్యమాని మౌలిక సౌకర్యాల కల్పన శూన్యం కావడంతో వార్డు ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఏ ప్రాంతంలో చూసినా వెలగని వీధి లైట్లు, ధ్వంసమైన రోడ్లు, డ్రైనేజీలు లేని దృశ్యాలు, శిథిలమైన పార్కులు, తాగు నీరు లేక ఇక్కట్లు .. ఇలా సమస్యల సమాహారంగా ఈ వార్డు దర్శనమిస్తోంది. ఇక పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా తయారైంది. ఏ ప్రాంతం చూసినా వ్యర్థాలతో నిండి ఉంది. దుర్గంధం భరించలేకపోతున్నామని, తరచూ వ్యాధులతో ఇబ్బందిపడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





రుషికొండ, ఎండాడలోనూ...

రుషికొండ, ఎండాడ, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, దుర్గానగర్, ముబారక్‌కాలనీ ప్రాంతాల్లో పలు చోట్ల వీధిలైట్లు వెలగడం లేదు. ఈ సమస్య నెలల తరబడి వేధిస్తోంది. ఇదే అదనుగా తీసుకున్న కొందరు ద్విచక్రవాహనాలను టార్గెట్ చేసుకుని రాత్రి సమయాల్లో పెట్రోల్ తీసేయడం, టైర్లను తొలగించడం నిత్య ప్రక్రియగా మారిపోయింది. నివాసాల ముందు వాహనాలను నిలపాలంటేనే భయమేస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వానొస్తే పాముల బెడద

వర్షాలు పడుతున్నందున విష సర్పాలు నివాసాల్లోకి చొచ్చుకుని వస్తున్నాయి. రుషికొండ ప్రాంతంలో కొన్ని చోట్ల నివాసాలకు చేరుకునేందుకు ఇబ్బందిగా ఉంది. సరైన రోడ్డు మార్గం లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతంలో తాగునీరు తీవ్ర సమస్యగా ఉంది. ఏళ్లు గడుస్తున్నా అధికారులు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగర్‌నగర్‌లో సమస్యల కొలువు



సాగర్‌నగర్‌లో డ్రైనేజీ లేక రోడ్డుమీదే మురుగు

గుడ్లవానిపాలెం పంచాయతీలో ఉండే ఈ కాలనీ 30 ఏళ్ల క్రితం వుడా సాగర్‌నగర్ పేరుతో ఏర్పాటైంది. జీవీఎంసీలో విలీనమైన తరువాత ఈ సాగర్‌నగర్‌ను 8వ వార్డులో చేర్చారు. నగరపాలక సంస్థ గనుక తమ ప్రాంతం ఎంతగానో అభివృద్ధి చెందుతుందని స్థానికులు ఆశ పడ్డారు. కానీ ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. దీంతో అధికారుల చుట్టూ తిరగలేక స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎల్ఐజీ, ఎంఐజీల్లో నివాసాల మధ్య డ్రైనేజీలు నిత్యం మురుగునీరుతో పొంగిపొర్లుతున్నాయి. ఈ గృహ సముదాయాల మధ్య ఉన్న సీసీ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇదే ప్రాంతంలో ఉన్న జీవీఎంసీ పార్కు అధ్వాన స్థితికి చేరుకుంది. నిర్వహణ లేక చెత్త చెదారాలతో పశువులకు ఆసరాగా మారిపోయింది.



తాటిచెట్లపాలెంలో అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ

ఆక్రమణల జోరు : సాగర్‌నగర్, ముసలయ్యపాలెం, ఎండాడలో ఇప్పటివరకు ప్రభుత్వ స్థలాల ఆక్రమణకు గురికాగా, ఇప్పుడు రోడ్లు, డ్రైనేజీలను కూడా ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో పాటు ప్రధాన రహదారుల వద్దనే పార్కింగ్ చేయడం వలన ట్రాఫిక్ సమస్య తీవ్ర రూపం దాల్చుతోంది. అనధికారికంగా బడ్డీలను ఏర్పాటు చేయడంతో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. వీటిపై పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు ఫిర్యాదు చేసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతం సమీపంలోనే సచివాలయాలు ఉన్నా ఏ అధికారీ అందుబాటులో ఉండటం లేదన్నారు. మధురవాడ జోనల్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

తాగునీరు లేక ఇబ్బంది



రుషికొండలో తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నాం. మా ప్రాంతంలో బోర్లు పాడయ్యాయి. వాటికి మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. జీవీఎంసీ కుళాయిల పైనే ఆధారం. అధికారులు స్పందించి బోర్లు అందుబాటులోకి తేవాలి.

– అప్పలరాజు, రుషికొండ

నిత్యం చీకటి



సాగర్‌నగర్‌లో నిత్యం చీకటిలోనే ఉంటున్నాం. రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలగక రోడ్డు ప్రమాదాలతో పాటు దొంగతనాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. వాహనాలు బయటపెడదామంటే పెట్రోల్ తీసేస్తారని భయం. వర్షం పడితే పాములు వచ్చేస్తున్నాయి. దీంతో రాత్రయితే, బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నాం.

– ఎం. అప్పలనాయుడు

పారిశుధ్య నిర్వహణ దారుణం



వార్డులో పారిశుధ్య నిర్వహణ దారుణంగా ఉంది. రోడ్డుపై ఎక్కడ చూసినా వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయాయి. దుర్వాసనతో ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి. మరోవైపు దోమలు, ఈగలతో వ్యాధుల భయం. అధికారులు స్పందించాలి. పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలి.

– లొడగల రాము, ఎండాడ

ఆరోగ్యానికి యోగా



యోగాలో పాల్గొన్న విద్యార్థులు

భీమునిపట్నం: మంచి ఆరోగ్యంతో ఉండడానికి యోగా చక్కని మార్గమని సంశ్రయ ఫౌండేషన్ అధ్యక్షుడు లీలాప్రసాద్ అన్నారు. భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద విశాఖకు చెందిన భారత ప్రభుత్వ యువజన క్రీడల మంత్రిత్వశాఖ మరియు సంశ్రయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన యోగాపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా చేయగలమన్నారు. శరీరానికి వ్యాయామం ఎంతో అవసరమని, అందులో యోగాకు చాలా ప్రాధాన్యం ఉందని అన్నారు. ప్రతి రోజూ క్రమం తప్పకుండా యోగా చేస్తే ఆరోగ్య సమస్యలు ఉండవని, ఇది మన జీవన విధానానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా యోగాను అభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణుమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పలకలతో డ్రైనేజీని మూశారు



బాబ్‌కాట్‌తో డ్రైనేజీని పలకలతో మూసి శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: స్థానిక అంబేడ్కర్ కూడలిలో నెలరోజులుగా తెరచి ఉన్న డ్రైనేజీని జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది శుక్రవారం సిమెంట్ పలకలతో మూసివేశారు. గతంలో కురిసిన వర్షాలకు ఇక్కడ డ్రైనేజీ పెద్ద ఎత్తున పూడుకుపోవడంతో తెరచి లోపల పేరుకుపోయిన చెత్తను తొలగించారు. అనంతరం డ్రైనేజీపై కప్పు వేయడం మరచిపోయారు. దీంతో తరచూ ప్రమాదాలు జరగడం, చాలా మంది ఇందులో పడిపోవడం జరిగేది. దీనిపై 'నోరు తెరచిన ప్రమాదం' శీర్షికతో శుక్రవారం సాక్షిలో ప్రచురించిన వార్తకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహలక్ష్మినాయుడు స్పందించారు. వెంటనే బాబ్‌కాట్‌తో పలకలు మూసి వేసి, ఈ ప్రాంతంలో పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు.

శాకాంబరిగా దుర్గాలమ్మ

అమ్మవారికి సారె సమర్పణ



శాకాంబరి అలంకరణలో అమ్మవారు

మధురవాడ: చంద్రంపాలెంలోని జాతర గట్టు దుర్గాలమ్మ శుక్రవారం శాకాంబరిగా దర్శనం ఇచ్చారు. మిథిలాపురి వుడా కాలనీ కాయగూరల వ్యాపారి సూరిబాబు, సాయిప్రియ గార్డెన్‌కి చెందిన బిక్కం శ్రీధర్, మాలతీ దంపతులు సమకూర్చిన కాయగూరలు, ఆకు కూరలు, పండ్లు, పుష్పాలతో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అర్చకులు హరిప్రసాద్ శర్మ, మూర్తి శర్మ, చరణ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

చంద్రంపాలెం మహిళల సారె

అమ్మవారికి చంద్రంపాలెం గ్రామ మహిళలు సుమారు 50 రకాల తినుబండారాలు, స్వీట్లు, ప్రసాదాలు, పండ్లు, కాయలతో సారె సమర్పించారు. బాజా భజంత్రీలు, కోలాటం, మేళ తాళాలతో సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి, అమ్మవారికి నివేదించారు. చంద్రంపాలెం గ్రామ పెద్దలు పిళ్లా సత్యనారాయణ, జయలక్ష్మి దంపతుల సహకారంతో అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, గ్రామ పెద్దలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



భక్తులు సమర్పించిన సారె

అమ్మవారికి ఆషాఢ సారె



అమ్మవారికి సారె పట్టుకు వెళ్తున్న రామన్నపేట మహిళలు

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు రామన్నపేట మహిళలు శుక్రవారం విజయదుర్గ అమ్మవారికి ఆషాఢమాస సారె సమర్పించారు. సుమారు వంద మంది మహిళలు పసుపు–కుంకుమ, స్వీట్లు, పండ్లు, చీరలు, చలిమిడి, పంచదార చిలకలు, కలశాలు, పళ్లాలు, కావిళ్లతో మేళతాళాలు వెంట రాగా ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ముందుగా ఎల్లారమ్మ చదురుకు వెళ్లి అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించారు. అనంతరం బైపాస్ రోడ్డులోని విజయదుర్గ ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. రామన్నపేట మహిళలు ఆలయంలో భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు పద్మనాభం మండల సర్వసభ్య సమావేశం

పద్మనాభం: పద్మనాభం మండల సర్వ సభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

9న సమ్మె జయప్రదం చేయాలి

తగరపువలస: ఈ నెల 9న జరగనున్న అఖిల భారత పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సిటు నాయకులు చిట్టివలసలోని తమ కార్యాలయం నుంచి శుక్రవారం బైక్ ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ భీమిలి రోడ్డు, మెయిన్‌రోడ్డు, బైపాస్ రోడ్డు మీదుగా భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీ వరకు సాగింది. మార్గమధ్యలో బైపాస్‌రోడ్డులోని అల్లూరి చిత్రపటానికి నివాళులు అర్పించారు. దివీస్ యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చారు. సిటు భీమిలి అధ్యక్షుడు ఆర్ఎస్ఎన్ మూర్తి, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాలి

- పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చిన్న శ్రీను
- 13న పార్టీ నియోజకవర్గ సమావేశం



ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న చిన్న శ్రీను

కొమ్మాది: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేద్దామని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అన్నారు. అందులో భాగంగా ఈ నెల 13న నిర్వహించనున్న పార్టీ నియోజకవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. నియోజకవర్గ స్థాయి నాయకులతో ఎండాడ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి ముఖ్య నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. నియోజకవర్గ భవిష్యత్తు ప్రణాళిక, పార్టీ తరఫున చేయనున్న కార్యక్రమాలను ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలియజేశారు.

నేడు పార్టీ విస్తృత సమావేశానికి హాజరు కావాలి

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు రుషికొండ ఏ1 గ్రాండ్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్న జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున నాయకులు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆధ్వర్యంలో జరగనున్న సమావేశానికి ప్రతి ఒక్కరూ తప్పక హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కోరాడ వెంకట్రావు, ఎంపీపీలు దంతులూరి వాసురాజు, కె.రాంబాబు, ముఖ్య నాయకులు మజ్జి వెంకట్రావు, దాట్ల పెదబాబు, కార్పొరేటర్లు అక్కరమాని రామానాయుడు, దౌలపల్లి కొండబాబు, పార్టీ మండల అధ్యక్షులు గాడు శ్రీను, బంక సత్యం, వార్డు అధ్యక్షులు గుడ్ల పోలిరెడ్డి, బొట్టా అప్పలరాజు, పోతిన శ్రీనివాస్, పోతిన హనుమంతు, నాయకులు అక్కరమాని మంగరాజు, వంకాయల మారుతి ప్రసాద్, కరుణాకర్ రెడ్డి, జగ్గుపల్లి ప్రసాద్, ఇల్లాపు వెంకట్రావు తదితర నాయకులు పాల్గొన్నారు.

ముచ్చటగా 3 ఇళ్లతో సరి

మమ అనిపించిన 'సుపరిపాలనలో తొలి అడుగు'



ఎమ్మెల్యే గంటాకు సమస్య చెబుతున్న బుచ్చమ్మ

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు పరదేశిపాలెంలో శుక్రవారం ప్రారంభించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం ముచ్చటగా మూడు ఇళ్లకు సరిపెట్టేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వస్తున్నారని తెలిసి స్థానికులు వినతి పత్రాలతో సిద్ధంగా ఉన్నారు. ఎమ్మెల్యే తమ ఇంటి దగ్గరకే వస్తారని, సమస్యలు చెప్పుకోవడానికి అవకాశం ఉంటుందని భావించి మీటింగ్‌కి వచ్చారు. సమస్యలు చెప్పబోతున్న ఇతర మహిళలను కూడా ఇంటికి వస్తారు కదా, అక్కడ చెబుదురులే అని టీడీపీ నాయకులు వారించారు. అయితే ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాత్రం గ్రామంలో ముచ్చటగా మూడు ఇళ్లకు వెళ్లి, కరపత్రాలు అందించి వెనుదిరిగారు. దీంతో అంతా నిరాశకు గురయ్యారు. పరదేశిపాలేనికి చెందిన నీలి బుచ్చమ్మ తమ సమస్యను ఎమ్మెల్యేకు తెలియజేశారు. తమ కుమారుడు జీవీఎంసీలో ఆప్కాస్ ఉద్యోగిగా రూ.12 వేల జీతానికి పని చేస్తున్నాడని తెలిపారు. అయితే అతడు ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నాడని పింఛన్, ఇళ్లు వంటి సంక్షేమ పథకాలు ఇవ్వడం లేదని తెలిపారు. తనకు వయసు పైబడడంతో పని చేయలేకపోతున్నానని, పింఛన్ అయినా ఇప్పించమని వేడుకుంది. రచ్చబండపై నిర్వహించిన సభలోనే టీడీపీ నాయకులు సూరిబాబు, మాజీ సర్పంచ్ బొయి శ్రీను తదితరులు హామీలు నెరవేర్చాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలో బోరుబావి ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దివీస్‌లో భద్రతా తనిఖీలు



దివీస్ ఉద్యోగులతో మాట్లాడుతున్న డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సురేష్

తగరపువలస: ఇటీవల తెలంగాణలోని ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదం నేపథ్యంలో చేపడుతున్న భద్రతా తనిఖీలలో భాగంగా డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.సురేష్ శుక్రవారం చిప్పాడలోని దివీస్ లేబొరేటరీని సందర్శించారు. సంస్థ భద్రతా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ డ్రిల్, సేఫ్టీ కమిటీ మీటింగ్, ఇన్‌స్పెక్షన్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. పౌడర్ ఫైర్ ఎక్స్‌ప్లోజివ్, సాల్వెంట్ ట్యాంక్ ఫోమ్ ఫైర్‌పై నిర్వహించిన డ్రిల్‌లో సూచనలు చేశారు. సంస్థ డైరెక్టర్ దేవేందరరావు, వైస్ ప్రెసిడెంట్ రమణ, భద్రతా కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ ఉద్యోగుల ప్రతిస్పందనను అభినందించారు. జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చిన్న శ్రీను
- జయంతి వేళ మన్యం వీరుడికి ఘన నివాళులు



పాండ్రంగిలోని అల్లూరి జనన గృహంలో నివాళులర్పిస్తున్న చిన్న శ్రీను తదితరులు

పద్మనాభం: మన్యంలో గిరిజనుల హక్కుల కోసం అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటాన్ని నేటి యువతరం స్ఫూర్తిగా తీసుకుని ముందడుగు వేయాలని వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) అన్నారు. అల్లూరి జయంతి సందర్భంగా పాండ్రంగిలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి, జనన గృహంలోని అల్లూరి సీతారామరాజు, అల్లూరి తల్లి సూర్యనారాయణమ్మ విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి అంజలి ఘటించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో పాండ్రంగిలో రూ.2.50 కోట్లతో అల్లూరి సీతారామరాజు మ్యూజియం నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. దీని నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బోని బంగారునాయుడు, పార్టీ నాయకులు దాట్ల పెదబాబు, మజ్జి వెంకటరావు, పల్లి మహేష్, బుగత సత్యనారాయణ, అముజూరి అప్పారావు, ఈర్ల ఈశ్వరరావు, సీర సూరప్పడు, మరగడ అప్పారావు, కోన రమణ, చందక శ్రీను, కిలపర్తి సత్యనారాయణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.



అల్లూరి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఈడీ రాణి మందా

విప్లవజ్యోతికి నివాళులు

- **తగరపువలస:** గుజ్జు రామునాయుడు భవన్‌లో అల్లూరి చిత్రపటానికి సీపీఐ, ఏఐటీయూసీ, చిట్టివలస లేబర్ యూనియన్ నాయకులు నివాళులర్పించారు. ఆనందపురం మండలం పందలపాక ఐటీబీపీ 56వ బెటాలియన్‌లో అల్లూరికి నివాళులర్పించారు.
- గణేష్‌నగర్ యూపీహెచ్‌సీ ఆవరణలోని అల్లూరి విగ్రహం వద్ద మధురవాడ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో అల్లూరికి నివాళులర్పించారు.

భీమిలి డిగ్రీ కళాశాలలో..

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి నివాళులు అర్పించారు.



అల్లూరి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న పౌర సంక్షేమ సంఘం నాయకులు



బక్కన్నపాలెం పోలీస్ బెటాలియన్‌లో ..

టీసీఆర్‌టీఎం భవన్‌లో..

కొమ్మాది: రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధనా శిక్షణ మిషన్ (టీసీఆర్‌టీఎం) భవన్‌లో అల్లూరి చిత్రపటానికి ఈడీ రాణి మందా నివాళులర్పించారు.

ఏపీఎస్పీ 16వ పోలీస్ బెటాలియన్‌లో..

పీఎం పాలెం: బక్కన్నపాలెంలోని ఏపీఎస్పీ 16వ పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు అల్లూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

శిల్పారామంలో..

శిల్పారామంలో స్థానిక పరిపాలన అధికారి రమేష్ రెడ్డి అల్లూరి విగ్రహానికి అంజలి ఘటించారు. శిల్పారామం సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు. పాటల పందిరి సభ్యులు, జాతర వాకర్స్ అసోసియేషన్ సభ్యులు అల్లూరికి నివాళులు అర్పించారు.

మన్యం వీరుడికి నీరాజనం

మధురవాడ: గణేష్‌నగర్ ఏఎస్ఆర్ నగర్ వద్ద సీపీఐ రాష్ట్ర నాయకుడు మరుపిళ్ల పైడిరాజు ఆధ్వర్యంలో అల్లూరికి నివాళులర్పించారు.



గుజ్జు రామునాయుడు భవన్‌లో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వామపక్ష నాయకులు